సాక్షి కామారెడ్డి

శనివారం । 2 । ఆగస్టు । 2025



మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ప్రజలకు సూచించారు.

- 8లో ▸



వైద్యులున్నా.. సేవలు సున్నా

ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలోని దంతవైద్య విభాగంలో వైద్యులున్నా.. పరికరాలు లేకపోవడంతో రోగులకు సేవలు అందడం లేదు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4 /22.3

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వాస్పత్రి తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు.

'ఈ-పాస్ ద్వారానే ఎరువులు అమ్మాలి'



బీబీపేట : ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువుల అమ్మకాలు జరపాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘాన్ని పరిశీలించారు. ఎరువుల అమ్మకాలు, నిల్వల గురించి తెలుసుకున్నారు. ప్రతి లావాదేవీకి బిల్లులు జారీ చేయాలని, స్టాక్ డిస్‌ప్లే బోర్డులను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. డీసీవో వెంట క్లస్టర్ అధికారి రమేష్, మానిటరింగ్ అధికారి నాగేష్, సంఘ సిబ్బంది ఉన్నారు.

బాలికల గురుకులం సందర్శన



కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల, హాస్టళ్లను సంక్షేమ శాఖ జిల్లా అధికారి దయానంద్ సందర్శించారు. భోజనశాలతో పాటు మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్న పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

చంద్రబాబు కోసం తెలంగాణకు అన్యాయం

- బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తన గురువు చంద్రబాబు మెప్పు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో బీజేపీ, చంద్రబాబు కలిసి ఆడుతున్న నాటకంలో రేవంత్‌రెడ్డి పావులా మారాడన్నారు. శుక్రవారం ప్రశాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లో కట్టి తీరుతామని ఏపీ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు చేసినప్పటికీ రాష్ట్ర బీజేపీ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడంతో అసలు లోగుట్టు బయటపడిందన్నారు. బనకచర్లను ఒక పథకం ప్రకారం బీజేపీ, చంద్రబాబు ముందుకు తీసుకుపోతున్నారని లోకేష్ వ్యాఖ్యలతో అర్థమైందన్నారు. ఇది రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకుల చేతకానితనానికి నిదర్శనమన్నారు. బనకచర్ల విషయమై ఢిల్లీకి వెళ్లేది లేదని చెప్పిన రేవంత్‌రెడ్డి, రాత్రికి రాత్రి మనసు మార్చుకుని, ఇందుకు సంబంధించి వేసిన కమిటీని ఒప్పుకునేది లేదని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బనకచర్ల ఎజెండాలో లేదని, దీని నిర్మాణం చేస్తామని చెబితేనే కదా అడ్డుచెప్పేదని వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం లోకేష్ మాట్లాడిన మాటలపై ఎందుకు మాట్లాడడంలేదన్నారు. మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి జుట్టు బీజేపీ, చంద్రబాబు చేతిలో ఉందన్నారు. దీంతో తనను తాను కాపాడుకునేందుకు రేవంత్‌రెడ్డి బనకచర్ల విషయంలో చంద్రబాబు, బీజేపీలకు వత్తాసు పలుకుతూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నాడన్నారు. ఇక తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలుచుకున్న బీజేపీ, కేంద్రం తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై మాట్లడడం లేదన్నారు. ఎట్టిపరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం చేసే బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడేది కేసీఆర్, బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. ఎప్పటికైనా తెలంగాణకు కేసీఆర్ పోరాటమే శ్రీరామరక్ష అన్నారు.

చిన్నారులపై చిన్నచూపు!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు
- సగం కేంద్రాలకే సొంత భవనాలు
- తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కరువు
- 515 కేంద్రాల్లో టాయ్‌లెట్స్ లేక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

ఓట్ల కోసం కమ్యూనిటీ హాళ్ల పేరుతో కుల సంఘాల భవనాలకు పోటీ పడి నిధులిచ్చే నేతలు.. అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చాలాచోట్ల కనీస వసతులు కూడా లేవు. అసౌకర్యాల మధ్యే చదువులు కొనసాగించాల్సి రావడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యంగా పెరిగేలా తల్లికి పౌష్టికాహారం అందించడం నుంచి బుడిబుడి అడుగులు వేస్తూ కేంద్రానికి చేరుకునే చిన్నారుల వరకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని పాలకులు చెబుతున్నా ఇప్పటికీ సగం కేంద్రాలకు సొంత భవనాలు లేవు. జిల్లాలో 1,193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 617 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 336 కేంద్రాలు అద్దె భవనాల్లో, 240 కేంద్రాలు రెంట్ ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏమోగానీ పట్టణాల్లో తక్కువ అద్దెకు ఇళ్లు దొరకడం కష్టం. దొరికినా అందులో సరైన సౌకర్యాలు ఉండవు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలతో పాటు పిల్లలకు మూత్రశాలలు ఉండక చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల సొంత భవనాలు ఉన్నా సరైన సౌకర్యాలు లేవు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాగునీటికి తప్పని కష్టాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య కూడా వెన్నాడుతోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 207 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం లేదు. ఆయా కేంద్రాల ఆయాలు సమీపంలోని ఇళ్లకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా కనెక్షన్లు ఇవ్వడంగానీ, మరే రకమైన సౌకర్యం గానీ కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. జిల్లాలో 202 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఆయా కేంద్రాల్లో చిన్నారులకు కనీసం ఫ్యాన్ కూడా ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి ఉంది. ఎండాకాలంలో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు.

ఇటీవల జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, భవనాలు నిర్మించడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విడతల వారీగా భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.




ఎల్లారెడ్డి పట్టణంలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న మూడో అంగన్‌వాడీ కేంద్రం

ఆరు బయటికే..

జిల్లాలోని దాదాపు సగం అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్స్ లేవు. జిల్లాలో 1,193 కేంద్రాలు ఉంటే 515 కేంద్రాల్లో మూత్రశాలలు లేవని అధికారిక రికార్డులే చెబుతున్నాయి. దీంతో పిల్లలు ఆరుబయటనే వెళ్లాల్సి వస్తోంది. కేంద్రాల పరిసరాల్లో పిల్లలు టాయ్‌లెట్‌కు వెళ్లినపుడు ఏదేని విషపురుగులు కాటేసే ప్రమాదం ఉంది. టాయ్‌లెట్స్ లేకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆయాల్లేక అవస్థలు..

జిల్లాలో 433 కేంద్రాల్లో సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో టీచర్లే ఆయా అవతారం ఎత్తాల్సిన పరిస్థితి ఉంది. గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు అన్నం వండి పెట్టాల్సిన బాధ్యత టీచర్లే మోస్తున్నారు. మీటింగ్‌లకు వెళ్లాలంటే కేంద్రాన్ని మూయాల్సి వస్తోంది. సొంత పని ఉండి సెలవు తీసుకున్నా కేంద్రానికి తాళం వేయాల్సిందే.. అలాగే జిల్లాలో 99 కేంద్రాలకు టీచర్లు లేరు. పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. ఎప్పుడు నియామకాలు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉంది.



ఎల్లారెడ్డి మండలం జిత్యా తండాలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

పక్కాగా మహిళాశక్తి అమలు

- అధిక సంఖ్యలో చిరు వ్యాపారాల గ్రౌండింగ్
- పెట్రోల్ బంక్‌లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు ప్రయత్నాలు
- 'సాక్షి'తో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేయడంలో ఇప్పటికే అనేక విజయాలు సాధించామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సురేందర్ పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వారు ఆయా రంగాల్లో సక్సెస్ సాధించేలా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఐదు క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా నాలుగు ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కువ క్యాంటీన్‌లు మన జిల్లాలో ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. కొత్తగా 2,892 చిరు వ్యాపారాలు ఏరాటు చేయాలని, 8,677 పాత వాటిని విస్తరించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,665 పూర్తి చేసి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచామన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో గతంలో 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈసారి 181 ఏర్పాటు చేసి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. దీంతో మహిళా సంఘాలకు రూ. 3కోట్ల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

పలు చోట్ల ప్రయత్నాలు..

జిల్లాలో కామారెడ్డి, నస్రుల్లాబాద్ మండలాల్లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని డీఆర్‌డీవో తెలిపారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికే భూమి కేటాయించారని వివరించారు. నాగిరెడ్డిపేట మండలం మత్తమల్ వద్ద ఏర్పాటుకు భూమి చూపించినప్పటికీ నేషనల్ హైవే అథారిటీ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఆగామన్నారు. అన్ని అనుమతులు వచ్చిన తర్వాత బంక్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

మీ సేవా కేంద్రాలు...

మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, వాటికి సంబంధించి కసరత్తు నడుస్తోందని డీఆర్‌డీవో వివరించారు. బ్యాంకు లింకేజీ రుణాలు ఈ త్రైమాసిక లక్ష్యం మేరకు రూ.200 కోట్లు ఇచ్చామన్నారు.

సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు...

నాగిరెడ్డిపేట, పిట్లం మండలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సురేందర్ తెలిపారు. భూమి ఏ మేరకు అనుకూలమన్న దానిపై సర్వే నడుస్తోందన్నారు.

రైస్‌మిల్లులు..

జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని డీఆర్‌డీవో పేర్కొన్నారు. దోమకొండ, జుక్కల్ మండలాల్లో ఏర్పాటుకు కసరత్తు సాగుతోందన్నారు. ఫుడ్, వెజిటబుల్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో డీఆర్డీవో ఆధ్వర్యంలో 400 పాడి గేదెలు ఇవ్వాలన్న లక్ష్యంగా ఉండగా 264 అందించామన్నారు. కోళ్ల పెంపకం మదర్ యూనిట్లు 22 లక్ష్యం కాగా 11 పూర్తియ్యాయని తెలిపారు. సంఘాల్లో కొత్తగా 7 వేల మంది సభ్యులను చేర్పించాలన్న లక్ష్యం మేరకు ఇప్పటికే 2 వేల మందిని చేర్పించామని వివరించారు.

నాయకుడిని కాదు.. మీ సేవకుడిని



పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా..
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట: ''నేను నాయకుడిని కాదు.. ప్రజా సేవకుడిని.. ఎవరికి కష్టం వచ్చినా తోడుగా ఉంటా'' అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా లింగంపేటలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యేకు నల్లమడుగు చౌరస్తా నుంచి లింగంపేట అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తాను ఎర్రాపహాడ్ ఉన్నత పాఠశాలలో చదువుకొన్నానని గుర్తు చేశారు. అమెరికా వెళ్లి వేల కోట్లు సంపాదించానని పేర్కొన్నారు. తాను డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చానని పేర్కొన్నారు. పుట్టిన రోజున వందల కోట్లు ఖర్చు పెట్టి పెద్దపెద్ద నాయకులు, పారిశ్రామికవేత్తలతో వేడుకలు చేసుకున్నా కానీ సంతృప్తి లేదన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గ ప్రజలతో జరుపుకుంటున్న బర్త్‌డేతో సంతృప్తి పొందానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేంత వరకు శ్రమిస్తునే ఉంటానన్నారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను పట్టుపట్టి మంజూరు చేయించానన్నారు. తాను అభివృద్ధి ప్రదాతనే అని, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. లింగంపేట మండలం నల్లమడుగు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జీవదాన్ స్కూల్, గ్రామ పంచాయతీ కార్యాలయం, మోహిన్ హమ్మద్ ఖాద్రీ రిసార్ట్‌లలో కేక్‌లు కట్ చేశారు. కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోకుల్ సాయిరాం, రఫీయోద్దీన్, సంతోష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి ఫతియోద్దీన్, మోహిద్, వాహబ్, ఇబ్రహీం, అశోక్, విఠల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్ : నలభై ఏళ్ల వయసు పైబడిన వారందరూ క్రమం తప్పకుండా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. జిల్లా ఆస్పత్రిలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు వైద్య పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడి అందరూ కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలతో ముందస్తుగా వ్యాధులను గుర్తించి ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో శిథిలావస్థలో ఉన్న పాత బిల్డింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. భవనానికి మరమ్మతులు చేయించాలని సూచించారు. సదరం పరీక్షలకు అవసరమైన వైద్య పరికరాలు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్ తదితరాలను సమకూర్చుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ పెరుగు వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షల శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మహాసభలను విజయవంతం చేయాలి'

మాచారెడ్డి: కామారెడ్డిలో ఈనెల 6న నిర్వహించే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దశరథ్ కోరారు. శుక్రవారం ఆయన మాచారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. మహాసభలకు పార్టీ రాష్ట్ర, జాతీయ స్థాయి ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజు, దేవయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'జనహిత'కు సర్వం సిద్ధం

- నేడు ఆర్మూర్‌లో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర
- ఆదివారం శ్రమదానం.. నాయకులతో సమావేశం

ఆర్మూర్: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ జనహిత పాదయాత్రకు సర్వం సిద్ధమైంది. రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గం ఆలూర్ మండల కేంద్రానికి శనివారం సాయంత్రం 4 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి గగ్గుపల్లి, ఇస్సాపల్లి, ఆర్మూర్ పట్టణంలోని కాశీ హనుమాన్ గల్లీ, జెండా గల్లీ, గోల్ బంగ్లా మీదుగా పాత బస్టాండ్ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. దారి పొడవునా ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోనున్నారు. అనంతరం ఆర్మూర్ పట్టణంలోని మాజీ ఎంపీపీ పీసీ ఉషారాణి భోజన్న ఇంట్లో రాత్రి బస చేస్తారు.

ఆదివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని గోల్‌బంగ్లా నుంచి పోచమ్మ మందిరం కమాన్ వరకు శ్రమదానం చేస్తారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో మాట్లాడి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతారు. అనంతరం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని యమున గార్డెన్స్‌లో జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. జనహిత పాదయాత్ర రూట్ మ్యాప్‌ను సీపీ సాయి చైతన్య, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ జీవన్, మార చంద్రమోహన్ ఉన్నారు.

సయోధ్య కుదిరేనా?

ఆర్మూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్, జూనియర్ నాయకుల మధ్య కొన్నాళ్లుగా అభిప్రాయ బేధాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొద్దుటూరి వినయ్‌రెడ్డి గెలుపు కోసం పని చేసిన సీనియర్ నాయకులు ఎన్నికల అనంతరం క్రమంగా దూరమయ్యారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్ నాయకులు వినయ్‌రెడ్డి అనుచరగణాన్ని జూనియర్లుగా భావిస్తుండడంతో విభేదాలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్‌లో ఉంటూ పీవీఆర్ పేరిట సొంత గ్రూప్‌ను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపిస్తూ సీనియర్ నాయకులు పలుమార్లు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులే కాంగ్రెస్‌లో చేరి వినయ్‌రెడ్డి ప్రధాన అనుచరులుగా కొనసాగడంపై ఆగ్రహంగా ఉన్నారు. ఇదిలాగే కొనసాగితే స్థానిక ఎన్నికలపై ప్రభావం పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాదయాత్ర నేపథ్యంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ రెండు గ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తుందని కార్యకర్తలు భావిస్తున్నారు.

బ్లూకోల్ట్ విధుల్లో మహిళా కానిస్టేబుళ్లు

- మొదటి విడతలో 5 పీఎస్‌ల ఎంపిక
- జెండా ఊపి సేవలను ప్రారంభించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం : మహిళా పోలీసులూ బ్లూకోల్ట్ విధుల్లో భాగమయ్యారు. మొదటి విడతలో ఐదు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేసిన అధికారులు.. శుక్రవారం సేవలకు శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణ నుంచి ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు బ్లూకోల్ట్ విధుల్లో పురుష కానిస్టేబుళ్లు మాత్రమే ఉండేవారన్నారు. తాజాగా మహిళా కానిస్టేబుళ్లూ ఇందులో భాగమవుతారన్నారు. మొదటి విడతలో భాగంగా కామారెడ్డి, దేవునిపల్లి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, భిక్కనూరు పీఎస్‌లను ఎంపిక చేశామన్నారు. డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలని విధులకు ఎంపిక చేసిన సిబ్బందికి సూచించారు. స్వీయ రక్షణ పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, సీఐలు నరహరి, సంతోష్ కుమార్, నవీన్, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా బ్లూకోల్ట్ సేవలను ప్రారంభిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీలు

క్లుప్తంగా

మాందాపూర్‌లో పింఛనుదారుల కష్టాలు



బీబీపేట: మాందాపూర్‌లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీసు సిబ్బంది ఒకరే ఉండటంతో పాటు ముఖ చిత్రాలతో పింఛన్లను పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి క్యూలైన్లో వేచి చూడాల్సి వస్తోంది. అంతే కాకుండా పింఛన్ల కోసం ఇతర గ్రామాలకు వెళ్లి పింఛన్లు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఎక్కువ మంది సిబ్బందిని నియమించి పింఛన్లను త్వరగా పంపిణీ చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

బీపీఎంపై చర్యలు తీసుకోవాలి

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద తడ్గూర్, అవాల్‌గావ్ రెండు గ్రామాల పింఛన్ డబ్బులు పంపిణీ చేయడం లేదని పింఛనుదారులు శుక్రవారం మండల కేంద్రంలోని పోస్టు ఆఫీస్‌కు తరలివచ్చి, బీపీఎం ఖాజాపై చర్యలు తీసుకోవాలని సబ్ పోస్ట్ మాస్టర్‌కు వినతి పత్రం అందించారు. రెండు గ్రామాలకు చెందిన వృద్ధులు ప్రతి నెలా పింఛన్ డబ్బులు కోసం అవస్థలు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తిండీ తిప్పలు లేక వేచి ఉంటున్నా బీపీఎం ఖాజా వచ్చి డబ్బులు పంపిణీ చేయడం లేదని వారు విమర్శించారు. ప్రతి నెలా డబ్బులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫోన్ చేసిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని వృద్ధులు ఫిర్యాదు చేశారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ



బాన్సువాడ రూరల్: రాంపూర్‌లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సురేష్ కొత్తరేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూశామని, ప్రభుత్వం కార్డులు మంజూరు చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అక్బర్, పర్వాగౌండ, షేక్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో బగళాముఖీ అమ్మవారి జన్మదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం అష్టమిని పురస్కరించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వెంకటేశం, రేవంతప్ప, సతీష్, సాయినాథ్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేత చక్రపాణి

బాన్సువాడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు వన మహోత్సవంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించే బాధ్యత అంత కన్నా ముఖ్యమని అన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. చెట్ల వల్ల వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని, ప్రజలందరు సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, అటవీశాఖ సెక్షన్ అధికారి సంజీవ్, ఏపీఎం గంగాధర్, అధికారులు ఉన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మొక్కలకు నీళ్లు పోస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వరప్రసాద్

మధ్యాహ్న భోజన కార్మికుల నిరాహార దీక్ష

బాన్సువాడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిరాహార దీక్షలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి మాట్లాడుతూ.. ఆరు నెలలుగా బిల్లలు రావడం లేదని, అప్పులు చేసి పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ.25 ఖర్చు అవుతుందని, ప్రభుత్వం మాత్రం రూ.11 ఇచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వమే రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సోఫియా, నాయకులు బాల్‌రాజ్, సంగీత, సరళ, స్వరూప తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మద్నూర్(జుక్కల్): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు సురేశ్‌గొండ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్పందించకపోతే హైదరాబాద్‌లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు సరస్వతి, సావిత్రి, వచలబాయి, ఫర్జానా, లాలాబాయి, మొగులవ్వ, తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో వినతి పత్రం అందిస్తున్న సురేశ్‌గొండ

మోడల్‌స్కూల్ విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎన్‌ఆర్‌ఐ రోష్ని నాగర్ కాంతి గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లోని 25 మంది విద్యార్థులకు శుక్రవారం క్రీడా దుస్తులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్లో ఉంటున్న రోష్ని నాగర్ కాంతి తాతయ్య, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నల్మాస్ ఆనందమ్, అమ్మమ్మ భాగ్యలక్ష్మి శుక్రవారం గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లోని విద్యార్థులకు ఈ దుస్తులను అందజేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం డాక్టర్ నల్మాస్ ఆనందమ్ రూ.10వేలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. నల్మాస్ ఆనందమ్, భాగ్యలక్ష్మి దంపతులను ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ రాంప్రసాద్ ఘనంగా సత్కరించారు.

క్రెడా అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యేతో క్రెడా ప్రతినిధులు

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ ఏజెంట్స్ అసోసియేషన్(క్రెడా) అభివృద్ధికి కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం క్రెడా ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిశారు. క్రెడా భవన నిర్మాణానికి తనవంతు సహకారం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మిన ర్సాగౌడ్ ప్రధాన కార్యదర్శి రాంచందర్ నాయక్, ప్రతినిధులు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పలు సంఘాల నాయకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి వైద్య కళాశాల సమీపంలోని మున్నూరుకాపు జిల్లా సంఘం వద్ద అభివృద్ధి పనులకు సహకారం అందించాలని సంఘం జిల్లా నాయకులు, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ రావు పటేల్, ప్రధాన కార్యదర్శి అంజయ్యపటేల్‌లు శుక్రవారం ఎమ్మెల్యేకు పనుల గురించి వివరించారు. అలాగే పట్టణంలోని ఆర్యవైశ్య సంఘాల నాయకులు సైతం ఎమ్మెల్యేను కలిసి తమ సంఘాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

ఆలయాల పునర్నిర్మాణానికి కృషి చేయాలని వినతి

రాజంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, రాజరాజేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయని, వీటి పునర్నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం రాజంపేట గ్రామస్తులు ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. తన సొంత నిధులతో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఏడేళ్లుగా మూసిఉన్న సబ్ జైళ్లు

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలో మూసి వేసిన సబ్ జైలు

ఆర్మూర్: 2018 జనవరిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సబ్ జైళ్లను తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయగా అందులో జిల్లాలోని ఆర్మూర్, బోధన్ సబ్ జైళ్లు ఉన్నాయి.

- నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్ సబ్ జైళ్లతో పాటు వరంగల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల, ఖమ్మం జిల్లాలోని మదిర సబ్ జైళ్లను నిర్వహణ భారం కారణంగా మూసి వేస్తూ అప్పటి జైళ్ల శాఖ జీవో జారీ చేసింది.
- ఆర్మూర్ పట్టణంలో అసిస్టెంట్ సీనియర్ సివిల్ కోర్టు (ఫాస్ట్రాక్ కోర్టు), జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులు ఉన్నాయి.
- ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, ఆలూర్, నందిపేట, డొంకేశ్వర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ, మెండోర, ముప్కాల్, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, సిరికొండ మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసులను ఇక్కడ విచారిస్తారు.
- కాగా విచారణలో భాగంగా నిందితులుగా ఉన్న రిమాండ్ ఖైదీలను ఆర్మూర్ సబ్ జైలులో బంధించేవారు. శిక్షలు ఖరారు అయిన అనంతరం వారిని జిల్లా జైలుకు తరలించేవారు.
- కానీ ఆర్మూర్‌తో పోటు బోధన్ సబ్ జైలును ఎత్తివేయడంతో రిమాండ్ ఖైదీలను సైతం జిల్లా కేంద్రానికి తరలించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఖైదీలను కోర్టుకు తరలించే బాధ్యత నిర్వహించే పోలీసులపై మరింత పనిభారం పడింది.

రైళ్లల్లో ఉండే కోచ్‌లు

సమాచారం..



ఖలీల్‌వాడి: రైళ్లలో ప్రయాణించేటప్పుడు స్లీపర్, ఏసీ, జనరల్ బోగీల గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ ఏసీలో కూడా చాలా రకాలు ఉంటాయి. అందులో 1ఏ, 2ఏ, 3ఏ తరగతులతోపాటు ఇటీవల కొన్ని రైళ్లలో 3ఈ, ఈఏ వంటివి వందేభారత్ రైళ్లలో ఈసీ, సీసీ వంటి తరగతులు కూడా అప్పుడప్పుడు కనిపిస్తుంటాయి. ఒక్కో తరగతి(బెర్త్) టిక్కెట్ ఛార్జీ ఒక్కో రకంగా ఉంటుంది.

- **యూఆర్:** అన్ రిజర్వ్ పిలిచే కోచ్‌లను సెకండ్ క్లాస్ అంటారు. రిజర్వేషన్ లేకుండానే అప్పటికప్పుడు టిక్కెట్ తీసుకొని రైళ్లలో ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది.
- **స్లీపర్ క్లాస్:** తక్కువ ఖర్చుతో దూర ప్రయాణం చేసే వారు స్లీపర్ క్లాస్ టిక్కెట్‌ను ఎంచుకుంటారు. ఇవి నాన్- ఏసీ కోచ్. ఈ క్యాబిన్‌లో 8 బెర్తులు ఉంటాయి.
- **సెకండ్ సిట్టింగ్:** స్లీపర్ క్లాస్ తర్వాత రిజర్వేషన్ చేసుకునే అవకాశం సెకండ్ సిట్టింగ్ కోచ్‌లో ఉంటుంది. కొన్ని రైళ్లలో మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయి.
- **1ఏ:** ఫస్ట్ క్లాస్ ఏసీ స్లీపర్‌ను 1ఏ గా పిలుస్తారు. ఇందులో సైడ్ బెర్తులు లేకుండా రెండు లేదా నాలుగు బెర్తులు ఉంటాయి. రెండు బెర్తు ఉంటే కూప్ అని, 4 బెర్తులు ఉంటే క్యాబిన్‌గా పిలుస్తారు.
- **2ఏ:** దీనిని సెకండ్ ఏసీ, టూ టైర్ ఏసీ అని పిలుస్తారు. ఇందులో ఉండే క్యాబిన్ ఆరు సీట్లు ఉంటాయి. మిడిల్ బెర్తులు ఉండవు.
- **3ఏ:** మధ్యతరగతి ప్రజల కోసం ఉండే ఏసీ కోచ్ ఇది. స్లీపర్ క్లాస్ లాగే ఉండగా ఏసీ అదనంగా ఉంటుంది.
- **3ఈ:** థర్డ్ ఎకానమీగా పిలిచే ఈ కోచ్‌లు ఎక్కువగా గరీబ్‌రథ్, ఫలక్‌నామా రైళ్లలో కనిపిస్తుంటాయి. థర్డ్ ఏసీ కంటే తక్కువ ఛార్జీలు ఉంటాయి.
- **ఈఏ:** ఎగ్జిక్యూటివ్ అనుభూతిగా పిలిచే కోచ్‌లు శతాబ్ది రైళ్లలో అందుబాటులో ఉంటాయి. ఏసీతో కూడిన కుర్చీలు ఉంటాయి. ఇందులో సినిమాలు, సంగీతాన్ని వినడానికి ఎల్ఈడీ టీవీలు ఉంటాయి
- **ఈసీ:** ఎగ్జిక్యూటివ్ క్లాస్‌గా పిలిచే తరగతిలో ఏసీతో కూడిన సీట్లు ఉంటాయి. బెర్తులు ఉండవు. ఇవి వందే భారత్ రైళ్లలో అందుబాటులో ఉన్నాయి.
- **సీసీ:** ఏసీ చైర్‌కార్‌గా పిలిచే పగటి పూట ప్రయాణించే రైళ్లలో ఈ తరగతి అవకాశం ఉంటుంది. వందేభారత్ రైళ్లలో ఇది అందుబాటులో ఉంది.
- **విస్టాడోమ్:** పర్యాటక ప్రాంతాల్లో నడిచే రైళ్లలో అద్దాలతో నిర్మితమై ఉంటాయి.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



సోమారం తండాలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని పారదర్శకంగా..త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి శివ కుమార్ అన్నారు. సోమారం తాండాలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అలాగే గ్రామంలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

రాజంపేట: కొండాపూర్ జీపీ పరిధిలో శుక్రవారం మండలాధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. గ్రామ సంఘాల ద్వారా అవసరమున్నవారికి బ్యాంకు రుణాలు ఇప్పించి ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీడీవో బాలకృష్ణ, కార్యదర్శి శ్రీజ, సీసీ భాగయ్య, హౌసింగ్ ఏఈ రాము పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎం బదిలీ



మాచారెడ్డి: ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ బదిలీపై కామారెడ్డి వెళ్లారు. ఆయన స్థానంలో భీమ్‌గల్ ఏపీఎంగా పనిచేసిన పప్పుల రవీందర్ వచ్చారు. బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌ను సిబ్బంది సన్మానించారు.

నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వినతి



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కౌసల్య ఫౌండేషన్ కన్వీనర్ జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. ఈ మేరకు ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. అలాగే భిక్కనూరు రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు నిలిచేలా చూడాలని వినతి పత్రం ద్వారా కోరారు.

77వ సారి రక్తదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాలు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో 77వ సారి ఓ-పాజిటివ్ రక్తదానం చేశారు. గత 18 సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నానని, సాంకేతిక నైపుణ్యం ఎంత అభివృద్ధి చెందినా రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతగా నిలవడంతో పాటు, దాతలు గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి కాపాడుకో వచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతుందని రక్తదాత బాలు అన్నారు. రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, ఉపాధ్యక్షుడు పర్శ వెంకటరమణ తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం పీఈటీ జాదవ్ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన చవాన్ అరవింద్ 100 మీటర్ల పరుగు పందెంలో, గోతి జగదీశ్ 600 మీటర్ల పరుగు పందెంలో ఎంపికైనట్లు చెప్పారు. వారిని అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ గంగాకిషోర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, ప్రముఖ పద్యకవి డాక్టర్ బి.వెంకట్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాము, గంగాప్రసాద్ ఉన్నారు.

తాడ్వాయి నుంచి ఇద్దరు విద్యార్థులు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన చెందిన ఇద్దరు విద్యార్థులు అథ్లెటిక్స్ ఛాంపియన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ సురేఖ, పీఈటీలు సంధ్య, గంగామణి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న రవళి, స్నేహ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన 60 మీటర్ల పరుగు పందెం పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొనేందుకు ఎంపిక య్యారన్నారు. వారిని ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపల్ కార్మికులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ కార్మికులు బాగుంటేనే పట్టణం బాగుంటుందని అన్నారు. నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తున్న పట్టణానికి అందంగా తీర్చిదిద్దుతున్న కార్మికులకు ఏమి చేసిన తక్కువేనని అన్నారు. తెల్లవారు జామున నుంచే వీధులన్నీ శుభ్రం చేస్తున్న మురికికాలువల్లో చెత్త చెదారం తీసి వేస్తు సేవలందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సినియర్ అసిస్టెంట్ తుల శ్రీనివాస్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బిచ్కుందలో పారిశుధ్య కార్మికులకు..

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు స్వప్నాలీ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, వైద్య సిబ్బంది పవన్ కుమార్, మోయిన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161పై గల బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఇటుక లారీ గురువారం ఢీకొట్టడంతో ఘటన స్థలంలోనే ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన నాందేడ్‌కు చెందిన గణేష్ (20) నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. ఘటన స్థలంలో పిట్లం మండలంలోని రూమ్‌తండాకు చెందిన నర్సింగ్ మృతి చెందగా, అతడి భార్య హలవత్ సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మేకల చోరీకి పాల్పడిన నిందితుల పట్టివేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో మేకలను చోరీ చేసి, సంతలో విక్రయిస్తు నిందితులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా.. మండలంలోని శెట్పల్లి గ్రామంలో కందూర్ మైసయ్య, తక్కనోళ్ల లింగంకు చెందిన రెండు మేకలు కనిపించకపోవడంతో వారు అనుమానంతో శుక్రవారం పిట్లం సంతకు వెళ్లారు. అక్కడ అయ్యపల్లి గ్రామానికి చెందిన కంత్రపల్లి ప్రవీణ్, చల్ల మహేష్ వారి మేకలను విక్రయించడానికి ఉంచగా, పట్టుకొని పట్టుకొని గ్రామ పంచాయతీకి తీసుకువచ్చారు. అక్కడ నిందితులను విచారించగా అయ్యపల్లి గ్రామానికి చెందిన బొక్కల చిన్న కిష్టయ్య, చిలుక లక్ష్మినారాయణతో కలిసి మేకలను దొంగిలించి అమ్ముకున్నట్లు తెలిపారు. వీరు నలుగురు కలిసి అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ బాల్‌సింగ్‌కు చెందిన 4 మేకలను చోరీ చేసి బాన్సువాడ సంతలో గురువారం విక్రయించినట్లు తెలిపారు. దీంతో బాధితులు, గ్రామస్తులు వారిని పట్టుకుని లింగంపేట పోలీసులకు అప్పగించారు.

అధికారులు మారినా పేర్లు మారని వైనం



నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లి జీపీ భవనంలో సమాచార శాఖ అధికారులు మారినా కూడా బోర్డుపై పేర్లు మాత్రం తొలగించలేదు. గతంలో ఎంపీడీవోగా ఉన్న సుబ్రహ్మణ్యం బదిలీ అయి ఏడాది పూర్తివుతుంది. ఆయన ప్రస్తుతం రిటైర్డ్ కూడా అయ్యారు. ఎంపీవో రాము జుక్కల్ నియోజకవర్గానికి బదిలీపై వెళ్లి ఏడాది కావస్తోంది. పంచాయతీ కార్యదర్శి ముఖీద్‌కు టీచర్ ఉద్యోగం రావడంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. బోర్డులో ఉన్న ఒక్క అధికారి కూడా స్థానికంగా పని చేయడం లేదు. ఇంత కాలం మండల, జిల్లా స్థాయి అధికారులు సందర్శించినా కూడా బోర్డు మీద పేర్లను మాత్రం మార్చలేదు. ఇప్పటికైనా పేర్లు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: మండలంలోని కృష్ణానగర్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. కృష్ణానగర్‌లోని యార్లగడ్డ ప్రసాద్ తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం అతడి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీంను తెప్పించి వేలిముద్రలు సేకరించారు. ఇంటి కుటుంబసభ్యులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.20వేల నగదు, బైక్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఇంకా ఊరు నుంచి రాలేదని వారు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని, ఎస్సై తెలిపారు.

ఎర్రాపహాడ్‌లో బైక్ దగ్ధం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామశివారులో బైక్ దగ్ధం అయినట్లు గ్రామస్తులు, బాధితుడు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చెవుటి రాజు అనేవ్యక్తి ప్రతిరోజు మాదిరిగానే గురువారం రాత్రి తన గొర్ల మంద వద్దకు బైక్‌పై వెళ్లాడు. అనంతరం బైక్‌ను కొద్ది దూరంలో ఉంచి అక్కడే నిద్రపోయాడు. శుక్రవారం ఉదయం నిద్ర నుంచి లేచి చూసేసరికి బైక్ పూర్తిగా దగ్ధమై ఉందని ఉందన్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దగ్ధం చేసి ఉండవచ్చన్నారు. బైక్ విలువ సుమారు రూ.70వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

రుద్రూర్: భిక్షాటనకు వచ్చిన వ్యక్తి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి గ్రామానికి చెందిన అముల్ అనే వ్యక్తి శుక్రవారం భిక్షాటన కోసం కోటగిరికి వచ్చాడు. మండల కేంద్రంలో పర్యటిస్తూ ఒక ఇంటి వద్ద మహిళ చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు కోటగిరి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులమంటూ 7 తులాల బంగారం చోరీ

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులోని జాతీయ రహదారి 44పై నలుగురు వ్యక్తులు పోలీసులమంటూ చెబుతూ బంగారం చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన లింగాపురం గంగారెడ్డి గురువారం మధ్యాహ్నం, ఏర్గట్లకు చెందిన తన మేనత్త కొప్పెల లింగవ్వను బైక్‌పై ఎక్కించుకోని శుభకార్యం నిమిత్తం పెర్కిట్‌కు బయలుదేరాడు. బాల్కొండ- చిట్టాపూర్ శివారులోని హైవేపై నల్గురు వ్యక్తులు వచ్చి వారి బైక్‌ను ఆపారు. తాము ఢిల్లీ పోలీసులమంటూ చెప్పారు. ప్రస్తుతం దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాని, బంగారు ఆభరణలు ఎక్కువగా పెట్టుకోవద్దని సూచించారు. దీంతో లింగవ్వ మెడపై ఉన్న ఏడు తులాల బంగారంను తీస్తుండగా, వెంటనే వారు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితురాలు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాడ్వాయి మండలంలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో వా హనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ఎస్సై మురళి మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపినా..చిన్న పిల్లలకు వాహనాలను ఇచ్చినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

